## ఆకట్టుకున్న కూచిపూడి నృత్య ప్రదర్శనలు



కూచిపూడి నృత్య ప్రదర్శనలిస్తున్న కళాకారులు

కొండాపూర్, అక్టోబర్ 4 : మాదాపూర్‌లోని శిల్పారామంలో కొనసాగుతున్న గుజరాత్ ఉత్సవ్ మేళలో భాగంగా ప్రదర్శిస్తున్న పలు సాంస్కృతిక ప్రదర్శనలు సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ప్రదర్శనల్లో భాగంగా మయూరి డాన్స్ అకాడమీ గురువులు కుమారి యుక్త రెడ్డి తన శిష్య బృందంతో కలిసి కూచిపూడి నృత్య ప్రదర్శనలతో ఆకట్టుకున్నారు. మూషిక వాహన, పుష్పాంజలి, గోవిందా గోవిందా, భామాకలాపం, లింగాష్టకం, శ్రీలలిత హారతి, కృష్ణాష్టకం, బృందావన తిల్లాన, తారంగం, నమశ్శివాయతే, కొమ్మలాలా, పంచాక్షరీ అంశాలను యుక్త, యామిని, మౌక్తిక, శాన్వి, భవిష్య, నేహా, కృతిక, గుణ శ్రీక్షిత, నమ్రత, ధనస్విలు కూచిపూడి నృత్యరూపకంలో నర్తించి అలరించారు.

## ఆలోచింపజేసేలా చిత్రాలు..



క్యాన్సర్‌తో పోరాడుతున్న నానమ్మ మనుమరాలిని ప్రేమతో హత్తుకుంటున్నట్లుగా.. ఆకట్టుకుంటున్న చిత్రం

మాదాపూర్, అక్టోబర్ 4: కళాకారులు వేసిన చిత్రాలు సందేశాత్మకంగా ఆలోచింపజేసేలా ఉండటంతో సందర్శకులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఉమ్మడి కుటుంబంలో నానమ్మ, తాతయ్య, మనుమరాలు మధ్య ప్రేమాభిమానాలను చిత్ర రూపంలో ప్రదర్శించి మనసుకు హత్తుకునేలా సందేశాత్మకంగా కళాకారులు చిత్రాలను రూపొందించారు. మాదాపూర్‌లోని గ్యాలరీ 78లో బుధవారం ది రెసోనేటింగ్ నేరేటివ్స్ పేరుతో చిత్ర ప్రదర్శనను ఏర్పాటు చేశారు. ఇందులో కళాకారులు మానస ప్రియా, దీపాంజలి శేఖర్, తమిక్ష, పూనం బిస్వాజ్ ల చేతుల మీదుగా జాలు వారిన చిత్రాలు సందర్శకుల మనస్సును హత్తుకునేలా ప్రదర్శించారు. క్యూరేటర్ అమన్ ప్రీత్ కౌర్ సందర్శకుల సందేహాలను నివృత్తి చేసి చిత్రాల వెనక ఉన్నటువంటి సందేశాన్ని గురించి వివరించడం జరిగింది. ఈ నెల 10వ తేదీ వరకు కొనసాగనున్న చిత్ర ప్రదర్శనలో 30 రకాలైన చిత్రాలను ప్రదర్శించారు. వీక్షకుల కొరకు ఉదయం నుంచి సాయంత్రం 7 గంటల వరకు అందుబాటులో ఉంచనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

### సెక్యూరిటీ గార్డు కూతురి

## విద్యాభ్యాసానికి నవద్వీప ఫౌండేషన్ చేయూత

కొండాపూర్, అక్టోబర్ 4 : హైటెక్‌సిటీ మైహోం నవద్వీప అపార్ట్‌మెంట్స్‌లో సెక్యూరిటీ గార్డుగా విధులు నిర్వహిస్తున్న కుమారస్వామి అకాల మరణంతో అతడి కూతురు ఖమ్మం మేఘన ఉన్నత చదువులు మధ్యలో ఆగకూడదని, విద్యాభ్యాసానికి భరోసానిస్తూ, ఆమె చదువులకు అవసరమైన ఫీజులను నవద్వీప ఫౌండేషన్ చెల్లిస్తున్నట్లుగా ఫౌండేషన్ అధ్యక్షులు సత్యనారాయణ తెలిపారు. బుధవారం ఫౌండేషన్ సభ్యులు మేఘన ఇంజనీరింగ్ ద్వితీయ సంవత్సరానికి కళాశాల ఫీజు రూ. 99,034లను చెక్ ద్వారా చెల్లించడం జరిగిందని, రిసిప్ట్‌ను మేఘనకు అందజేసినట్లు తెలిపారు. మేఘన విద్యాభ్యాసం పూర్తయ్యే వరకు నవద్వీప ఫౌండేషన్ పూర్తి సహాయ సహకారాలు అందిస్తుందన్నారు.

## ఇన్‌కాయిస్‌లో సునామీ హెచ్చరికలపై మాక్‌డ్రిల్

దుండిగల్,అక్టోబర్4: ఇండియన్ నేషనల్ సెంటర్ ఫర్ ఓషన్ ఇన్ఫర్మేషన్ సర్వీసెస్(ఇన్‌కాయిస్)లో నేషనల్ డిజాస్టర్ మేనేజ్‌మెంట్ అథారిటీల సంయుక్తంగా బుధవారం సునామి మాక్‌డ్రిల్‌ను నిర్వహించారు. సముద్రతీర ప్రాంత రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోని విపత్తు నిర్వాహణ సంస్థలు నేవీ, కోస్ట్ గార్డ్, నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ ఫోర్స్, అణు విద్యుత్ ప్లాంట్లు, ఫోర్ట్, హర్భర్‌లకు చెందిన అధికారబృందం, సిబ్బంది వర్చువల్ వేదికగా సునామీ హెచ్చరికల ప్రమణాలపై చర్చించిన్నట్లు ఇన్‌కాయిస్ డైరెక్టర్ డా.టి.శ్రీనివాస్‌కుమార్ తెలిపారు.

## బాలుడు అదృశ్యం



రోహిత్‌రెడ్డి(ఫైల్)

బాలానగర్, అక్టోబర్ 4 : తల్లిదండ్రులు దవాఖానకు వెళ్లి వచ్చే సరికి ఇంట్లో ఉన్న కుమారుడు అదృశ్యమయ్యాడు. ఈ ఘటన బాలానగర్ పీఎస్ పరిధిలో చోటు చేసుకుంది. సీఐ కె.భాస్కర్ తెలిపిన వివరాల ప్రకారం..బాలానగర్ డివిజన్ పరిధి ఇందిరాగనర్‌లో ముద్దం శ్వేత కుటుంబం నివాసముంటున్నది. మంగళవారం శ్వేతకు అస్వస్థతగా ఉండడంతో మూసాపేటలో దవాఖానకు వెళ్లింది. సాయంత్రం ఇంటికి వచ్చే సరికి కుమారుడు రోహిత్‌రెడ్డి (6) కనిపించలేదు. అతడి ఆచూకీ కోసం వెతికినా ఫలితం లేకపోవడంతో బుధవారం బాలానగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు పోలీసులు కేసు దర్యాప్తు జరుపుతున్నారు.

# సౌకర్యవంతమైన ప్రయాణమే లక్ష్యం..

### విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

### పలు డివిజన్లలో అభివృద్ధిపనులకు శంకుస్థాపన




మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేస్తున్న విప్ గాంధీ, కార్పొరేటర్లు వి. జగదీశ్వర్ గౌడ్, పూజిత గౌడ్ తదితరులు

మాదాపూర్, అక్టోబర్ 4: సంక్షేమం, అభివృద్ధిపై రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తు చిత్తశుద్ధితో పనిచేస్తున్నదని స్థానిక ఎమ్మెల్యే, విప్ అరెకపూడి గాంధీ అన్నారు. చందానగర్ సర్కిల్ పరిధిలోని మాదాపూర్ డివిజన్ పరిదిలో రూ. 2.81 కోట్ల వ్యయంతో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయగా, హఫీజ్‌పేట్ డివిజన్ ప్రాంతాల్లో రూ.2.90 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు కార్పొరేటర్లు వి. జగదీశ్వర్ గౌడ్, పూజిత గౌడ్‌తో పాటు జీహెచ్ఎంసీ అధికారులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి బుధవారం శంకుస్థాపన చేశారు.

**హఫీజ్‌పేట్ డివిజన్‌లో రూ. 2.90 కోట్ల వ్యయంతో ..**

హఫీజ్‌పేట్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తూ రూ.2.90 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేశారు. ఈ నేపథ్యంలో హఫీజ్‌పేట్ డివిజన్ పరిధిలోని ఇంద్రారెడ్డి ఆల్విన్ కాలనీ, రామకృష్ణ నగర్, మదీనగూడ, మైత్రినగర్ ఫేస్ 3 కాలనీలో రూ.1.80 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయగా సాయి నగర్, యూత్ కాలనీ, భాను టౌన్‌షిప్ కాలనీలో రూ. 60 లక్షల వ్యయంతో చేపట్టనున్న సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంఖుస్థాపనలు చేయడం జరిగింది. హుడా కాలనీలో రూ. 50 లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు చేశారు.

**మాదాపూర్ డివిజన్‌లో రూ. 2.81 కోట్ల వ్యయంతో**

మాదాపూర్ డివిజన్ అభివృద్ధికి బాటలు వేస్తు రూ. 2.81 కోట్ల వ్యయంతో పలు అభివృద్ధికి శంకుస్థాపనలు చేయడం జరిగింది. ఈ నేపథ్యంలో మాదాపూర్ డివిజన్ పరిధిలోని గోకుల్ ప్లాట్స్ కాలనీలో రూ. 1.76 కోట్ల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, అయ్యప్ప సొసైటీ కాలనీలో రూ. 73లక్షల వ్యయంతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపనలు, సిద్ధి వినాయక నగర్ కాలనీలో రూ. 32 లక్షల వ్యయంతో చేపట్టనున్న మహిళా మండలి భవనం నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, వార్డు సభ్యులు, ఏరియా కమిటీ సభ్యులు, బీఆర్ఎస్ పార్టీ అనుబంధ సంఘాలు తదితరులు ఉన్నారు.

**చందానగర్‌లో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపన**

కొండాపూర్, అక్టోబర్ 4 : కాలనీలు, బస్తీల్లో మెరుగైన అంతర్గత రహదారుల నిర్మాణానికి ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం ఆయన చందానగర్ డివిజన్ పరిధిలోని పలు కాలనీల్లో చేపట్టనున్న సీసీ రోడ్లు (అంతర్గత రోడ్లు) నిర్మాణానికి రూ. 5కోట్ల 30లక్షల 50వేల రూపాయాలతో స్థానిక కార్పొరేటర్ మంజుల రఘునాథరెడ్డితో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో చందానగర్ డివిజన్ అధ్యక్షులు రఘునాథరెడ్డి, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, కాలనీవాసులు పాల్గొన్నారు.

**చందానగర్‌లో చేపట్టిన పనులు..**

- శంకర్‌నగర్, భవానీపురం, శంకర్‌నగర్ ఫేజ్–2లలో రూ. 95లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం
- సురక్ష ఎన్‌క్లేవ్, ఫ్రెండ్స్ కాలనీ, సత్య ఎన్‌క్లేవ్, జవహర్ కాలనీల్లో 124లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం
- శ్రీకృష్ణదేవరాయ కాలనీ, మియాపూర్ పోలీసు స్టేషన్ నుంచి మానస భేల్ టవర్స్ వరకు రూ. 60లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణం
- సిటిజెన్ కాలనీ, పూర్ణిమ టవర్స్, అహ్మద్‌నగర్, శివాజీనగర్ కాలనీల్లో రూ. 80లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం, ఓపెన్ జిమ్ సదుపాయాల కల్పన
- దీప్తిశ్రీనగర్, శాంతినగర్ కాలనీలో 100లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం
- అన్నపూర్ణ ఎన్‌క్లేవ్, వేముకుంట, గౌతమీనగర్ కాలనీల్లో రూ. 44.50లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

## సమృద్ధిగా తాగునీరు.. పటిష్టమైన డ్రైనేజీలు



మియాపూర్ డివిజన్‌లో రూ. 3 కోట్ల అభివృద్ధి పనులకు శంకుస్థాపనలో విప్ గాంధీ, కార్పొరేటర్ శ్రీకాంత్

మియాపూర్, అక్టోబర్ 4 : నియోజకవర్గంలోని ప్రతి డివిజన్‌లో మెరుగైన జీవన ప్రమాణాలను కల్పనకు అధిక ప్రాధాన్యతతో కృషి చేస్తున్నట్లు విప్ అరెకపూడి గాంధీ పేర్కొన్నారు. కోట్లాది నిధులను వెచ్చిస్తూ పక్కా సౌకర్యవంతమైన రహదారుల నిర్మాణం, చాలినంతగా శుద్ధమైన తాగునీరు, మురుగు సమస్యల్లేకుండా డ్రైనేజీ నిర్మాణాలను చేపడుతున్నామన్నారు. మియాపూర్ డివిజన్ పరిధిలోని నీలిమా గ్రీన్స్, ప్రగతీ ఎన్‌క్లేవ్, డీకే ఎన్‌క్లేవ్, జేపీనగర్, డాక్టర్ రెడ్డీస్ కాలనీ, శ్రీజ బృందావనం, బీకే ఎన్‌క్లేవ్, మయూరీ నగర్‌లలో రూ. 3 కోట్లతో చేపట్టనున్న సీసీ రోడ్డు నిర్మాణ పనులకు కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్, అధికారులు, కాలనీ వాసులు, పార్టీ నేతలతో కలిసి విప్ గాంధీ బుధవారం శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో డివిజన్ పార్టీ నేతలు, వార్డు ప్రతినిధులు, మహిళా నేతలు, కాలనీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

## మత్స్యకారుల ఆర్థికాభివృద్ధికి సర్కారు చేయూత



దుర్గం చెరువులో చేప పిల్లలను వదులుతున్న విప్ అరెకపూడి గాంధీ

కొండాపూర్, అక్టోబర్ 4 : నీలి విప్లవంతో తెలంగాణ మత్స్యకారుల కుటుంబాలు సంతోషంతో విరజిల్లుతూ సంబురాలు జరుపుకుంటున్నాయని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. బుధవారం ఆయన రాయదుర్గం ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ ఆధ్వర్యంలో సొసైటీ సభ్యులతో కలిసి మాదాపూర్‌లోని దుర్గం చెరువులోకి లక్ష చేప పిల్లలను వదిలారు. ఈ కార్యక్రమంలో జిల్లా మత్స్య శాఖ అధికారిని సుకీర్తి, బీఆర్ఎస్ నాయకులు గణేశ్ ముదిరాజ్, శ్రీనివాస్ యాదవ్, ఉరిటీ వెంకట్రావు, రాయదుర్గం ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ ప్రెసిడెంట్ సురేందర్ కుమార్, సభ్యులు శ్రీశైలం, నరేందర్, అశోక్, సురేశ్, వీరస్వామి పాల్గొన్నారు.

## నియోజకవర్గ తుది ఓటరు జాబితా ప్రదర్శన

మియాపూర్, అక్టోబర్ 4 : శేరిలింగంపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా తుది ఓటర్ల జాబితాను నియోజకవర్గ ఓటు నమోదు అధికారులు బుధవారం ప్రదర్శించారు. ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ ప్రక్రియను చేపట్టారు. తుది ఓటర్ల జాబితా మేరకు నియోజకవర్గంలో 6,98,079 ఓటర్ల నిర్ధారణయింది. ఇందులో పురుషులు 3,70,301, మహిళలు 3,27,636 కాగా 142 ఇతరున్నారు. శేరిలింగంపల్లి సర్కిల్‌లో 2,33,017, చందానగర్ సర్కిల్‌లో 2,68,746, కూకట్‌పల్లి సర్కిల్‌లో 1,96,316 ఓటర్లున్నన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా 622 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. కాగా నియోజకవర్గంలోని 622 పోలింగ్ కేంద్రాలలో తుది ఓటర్ల జాబితాను ప్రదర్శించారు. ఓటర్లు తమ సమీపంలోని పోలింగ్ స్టేషన్‌లో జాబితాలో తమ ఓటు వివరాలను పరిశీలించుకోవాలని నియోజకవర్గ ఈఆర్‌వో రజనీకాంత్‌రెడ్డి, ఏఈఆర్‌వో వంశీకృష్ణ తెలిపారు. తుది ఓటరు జాబితాను విడుదల చేసినప్పటికీ.. ఎన్నికల ప్రకటన వచ్చే వరకు ఆన్‌లైన్ ద్వారా నూతన ఓటరు దరఖాస్తులను సమర్పించే వెసులుబాటు ఉన్నది. వాటిని సప్లిమెంటరీ జాబితాలో నమోదు చేస్తారు.

**శేరిలింగంపల్లి తుది ఓటరు జాబితా సిద్ధం**

కొండాపూర్, అక్టోబర్ 4 : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు శేరిలింగంపల్లి సర్కిల్ –20 పరిధిలోని ఓటరు జాబితాను సర్కిల్ కార్యాలయంలో బుధవారం ఓటరు జాబితాను అందుబాటులో ఉంచినట్లు సర్కిల్ వీఆర్వో రజనీకాంత్‌రెడ్డి తెలిపారు. సర్కిల్ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలలో తుది ఓటరు జాబితాను అందుబాటులో ఉంచామని, రాజకీయ పక్షాలకు ఓటరు కాపీలను అందజేసినట్లు తెలిపారు. ఓటర్లు తమ సమీప పోలింగ్ కేంద్రాలలో పరిశీలించుకోవచ్చని, ఓటర్లుగా నమోదు చేసుకోలేని వారు ఆన్లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకోవాల్సిందిగా తెలిపారు.

## రాజకీయపక్షాలతో ఆర్‌వో సమావేశం

మియాపూర్, అక్టోబర్ 4 : ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు నియోజకవర్గంలో తుది ఓటరు జాబితా విడుదలైన నేపథ్యంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ ఆర్‌వో , జడ్సీ శ్రీనివాసరెడ్డి రాజకీయ పక్షాలతో బుధవారం తన కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తుది ఓటరు జాబితా ప్రతులను రాజకీయ పక్షాలకు అందించారు. అనంతరం ఆర్‌వో మాట్లాడుతూ ఓటరు జాబితా సవరణ ప్రక్రియకు ప్రజలు, రాజకీయ పక్షాల నుంచి తగు స్పందన లభించిందని, ప్రక్రియను అత్యంత సమర్థంగా చేపట్టినట్లు పేర్కొన్నారు. తుది ఓటరు జాబితా ప్రకారం నియోజకవర్గంలో 6,98,079 ఓటర్లు నిర్ధారణ అయినట్లు ఆర్‌వో తెలిపారు. అన్ని పోలింగ్ కేంద్రాలలోనూ తుది ఓటరు జాబితాను అందుబాటులో ఉంచినట్లు, పరిసర ఓటర్లు తమ ఓటు వివరాలను పరిశీలించుకోవచ్చునన్నారు. ఎన్నికల ప్రకటన విడుదలయ్యే వరకు నూతన ఓటరు దరఖాస్తుల స్వీకరణ ఆన్‌లైన్ ద్వారా కొనసాగుతుందని ఆర్‌వో శ్రీనివాసరెడ్డి సూచించారు. ఈ సమావేశంలో ఈఆర్‌వో రజనీకాంత్‌రెడ్డి, ఏఈఆర్‌వో వంశీకృష్ణ, ఏఎంసీ నరేందర్‌రెడ్డి, అధికారులు, రాజకీయ పక్షాల ప్రతినిధులు పాల్గొన్నారు.



రాజకీయ పక్షాలతో సమావేశంలో ఆర్‌వో, జడ్సీ శ్రీనివాసరెడ్డి